క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

పీలేరు రూరల్ : స్థానిక కోటపల్లెలో ఉన్న ఏపీ గిరిజన గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తెలిపారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 5వ తరగతి ప్రవేశానికి రిజర్వేషన్ల వారీగా ఎస్టీ 62, ఎస్సీ 10, బీసీ 4, ఓసీ 2, ఏఈక్యూ 2 సీట్లు కేటాయించినట్లు చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు 5వ తరగతి ప్రవేశానికి, అలాగే 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీలున్న సీట్ల భర్తీకి కూడా ఈ నెల 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 94909 80563 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

పశు వ్యాధులపై అవగాహన

వాల్మీకిపురం: రైతులు పశువుల్లో వ్యాపించే పొదుగు వాపు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని మండలంలోని నగిరిమడుగు పశు వైద్యాధికారిణి చరిత అన్నారు. గురువారం మండలంలోని జర్రావారిపల్లి పంచాయతీ మల్లిరెడ్డిగారిపల్లిలో పాడి రైతులకు అవగాహన కల్పించారు. పిడుదులు, ఈగలు వంటి బాహ్యపరాన్న జీవుల నిర్మూలన కోసం మందులను పిచికారి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మునిభాస్కర్, మాజీ సర్పంచ్ నాగార్జున, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సారాఊట ధ్వంసం

ములకలచెరువు: ములకలచెరువు సర్కిల్ పరిధిలోని తంబళ్లపల్లె మండలంలో సారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ మల్లిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రేకులకుంట తాండా సమీపంలో 500 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసినట్లు చెప్పారు.

చలివేంద్రం ఏర్పాటు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరు బస్టాండ్‌లో గురువారం గాలేటి నాగరాజు అనే ఓ ఆటో కార్మికుడు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశాడు. రథోత్సవం కావడంతో భక్తుల సౌకర్యార్థం మజ్జిగను పంపిణీ చేశాడు.

మదనపల్లె ఎఫ్‌ఆర్వోగా మదన్

మదనపల్లె : మదనపల్లె ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్(ఎఫ్‌ఆర్వో)గా మదన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గురువారం స్థానిక ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన ఆయన.. కుప్పం ఎఫ్‌ఆర్వోగా విధులు నిర్వహిస్తున్న తాను డెప్యుటేషన్‌పై మదనపల్లెకు బదిలీ అయినట్లు చెప్పారు.

బీజేపీ బలోపేతానికి కృషి

మదనపల్లె : బీజేపీని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి పార్టీ సిద్ధాంతాలను, ఆశయాలను వివరించి బలోపేతానికి కృషి చేద్దామని భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి ఆనంద్ అన్నారు. పట్టణ బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు జర్మన్‌రాజు, వసంత కుమార్, వేణు, పిల్లస్వామి నాయక్, మధుసూదన్ రావు, కిరణ్ కుమార్, గిరి, రాజారెడ్డి, బాలకృష్ణ, రాజేంద్ర, శబరి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం



ఈఓకు రూ. లక్ష అందజేస్తున్న దాతలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయానికి రూ. లక్ష విరాళాన్ని దాతలు అందజేశారు. ప్రస్తుతం ఆలయంలో గర్భాలయం పునర్నిర్మాన పనులు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో గురువారం కడప పట్టణానికి చెందిన చిన్నవెంకట సుబ్బయ్య తమ కుటుంబ సభ్యులతో ఆలయానికి చేరుకొని అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ. లక్షను ఆలయ కమిటీ ఛైర్మన్ నరసింహారెడ్డి, ఈఓ మంజులకు విరాళంగా అందజేశారు. అదేవిధంగా చిత్తూరుకు చెందిన పెంటం శెట్టి పద్మనాభయ్య కుమారుడు హరినాథ్ వాటర్ డిస్పెన్సరీని విరాళంగా అందజేశారు.

రాజ్యాంగ రక్షణభేరికి తరలిరండి

మదనపల్లె : విడుదలై చిరుతైగల్ కట్చి (వీసీకే) పార్టీ ప్రథమ రాష్ట్ర మహాసభను పురస్కరించుకుని ఏప్రిల్ 8న బీటీ కళాశాల గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న రాజ్యాంగ రక్షణభేరి సమావేశానికి ప్రజలు తరలిరావాలని వీసీకే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం.శివప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక బాస్ కార్యాలయం వద్ద వీసీకే పార్టీ నాయకులతో కలిసి ఆయన రాజ్యాంగ రక్షణభేరి వాల్‌పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ముత్యాల మోహన్, ఆర్‌జీఎస్ దివాకర్, సొన్నికంటి రెడ్డెప్ప పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

కలికిరి: సచివాలయాల్లో మెరుగైన సేవలందించాలని డీపీఓ ధనలక్ష్మి అన్నారు. పల్లవోలు గ్రామ సచివాలయాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సచివాలయంలో రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. పల్లవోలు కస్పాలోని అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ చేశారు. పక్కనే ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఆజాద్, సర్పంచ్ షేక్ బిబి ఆయేషా, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ జుబేర్ అహ్మద్ పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే వైద్య సేవలు

– ఎమ్మెల్యే నవాజ్‌బాషా



మదనపల్లె : ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా 104 వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా



వాల్మీకిపురం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

మదనపల్లె : ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా ఇంటి ముంగిటకే వైద్యసేవలు ప్రజలకు అందుతాయని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. గురువారం మండలంలోని వేంపల్లె హెల్త్ సబ్‌సెంటర్ వద్ద ఫ్యామిలీ డాక్టర్ పూర్తిస్థాయి వైద్య సేవలు ప్రారంభంలో భాగంగా 104 వాహనాల ద్వారా వైద్య సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం అద్భుతమైన కార్యక్రమమన్నారు. ప్రాణం విలువ తెలిసిన మనిషిగా డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు 108, 104 వాహనాలను తీసుకొచ్చారన్నారు. అందులో భాగంగా 104 వాహనాల ద్వారా క్షేత్రస్థాయిలోని ప్రతి ఇంటికీ వైద్య సేవలు అందేలా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ప్రతి పీహెచ్‌సీ సెంటర్ నుంచి ఇద్దరు డాక్టర్లు ఒకొక్కరు 13 రోజుల చొప్పున నెలలో 26 రోజులపాటూ గ్రామాల్లో 104 వాహనాల్లో విలేజ్ క్లినిక్ ద్వారా వైద్యసేవలు అందిస్తారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్య చికిత్సల్లో భాగంగా 14 రకాల వైద్య పరీక్షలు, 67 రకాల మందులు అందిస్తారన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు, గర్భవతులు, బాలింతలకు ఇంటి వద్దనే వైద్య సేవలు అందుతాయన్నారు. అనంతరం హెల్త్ సబ్‌సెంటర్‌ను తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని మందులను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో లక్ష్మి, ఎంపీపీ రెడ్డెమ్మ, వైస్ ఎంపీపీ వెంకటరమణ, వెలుగు చంద్ర, సర్పంచ్ పారాశి ఆదెమ్మ, సర్పంచ్ శరత్‌రెడ్డి, ఎంపీటీసీ సుభాషిణి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, బయ్యన్న, మాజీ జడ్పీటీసీ రంగప్ప, నాయకులు జగదీష్, 104 జిల్లా కోఆర్డినేటర్ ప్రవీన్, వైద్యులు అనుపమ, స్వాతి ప్రియాంక, పర్హాన్ తదితరులు పాల్గొన్నారు.

కలకడ : ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను గ్రామాలలో సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ జవహర్‌బాబు కోరారు. గురువారం ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని ముడియంవారిపల్లె, కదిరాయచెర్వు గ్రామాలలో పర్యటించి 58మందికి సాధారణ చికిత్సలు అందించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ జయరామయ్య, సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ, సిబ్బంది కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం: ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చింతపర్తిలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా మొబైల్ మెడికల్ యూనిట్ (104)ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్, డాక్టర్ మానస, సిహెచ్‌ఓ ఇందిరారాణి, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫి, సూపర్‌వైజర్లు సుధాకర్, పూర్ణమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పీలేరు : పీలేరు పట్టణంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమ వాహనాన్ని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా ప్రారంభించారు. డాక్టర్ కార్తీక్ కుమార్, డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ సుబ్రమణ్యం, ఎంపీటీసీ ఇబ్రహీం, ఆరీఫూన్, మునీర్, అబీద్, హబీబ్, సీహెచ్‌వో జయలక్ష్మీ, హెచ్‌ఈ ఉషారాణి, సూపర్‌వైజర్ విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌ను కోసువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ మునికుమార్ గురువారం గూండ్లపల్లె, గోపిదిన్నె సచివాలయాల వద్ద ప్రారంభించారు.

ఆకట్టుకున్న అర్జున తపస్మాన్



కలకడలో తపస్మాన్ ఎక్కుతున్న అర్జునుడి వేషధారుడు

కలకడ : మహాభారత యజ్ఞంలో భాగంగా గురువారం ఏర్పాటు చేసిన అర్జున తపస్మాన్ కార్యక్రమం ఆకట్టుకుంది. కలకడ శ్రీకామాక్షిసమేత సిద్దేశ్వరస్వామి ఆలయం సమీపంలో ధర్మకర్తలు రామయ్య, వెంకట్రమణనాయుడుల ఆధ్వర్యంలో సాగుతున్న యజ్ఞంలో భాగంగా గురువారం చేపట్టిన కార్యక్రమంలో అర్జునుడు శివుని గురించి తపస్సు చేసి పాసుపతాస్త్రం పొందే ఘట్టంలో భాగంగా 18 పర్వాలుగా 18 మెట్లు ఎక్కడానికి ప్రతి మెట్టుకు ఒక పాట, ఒకపద్యం, దాని అర్థం వివరించడాన్ని గంటల తరబడి భక్తులు వీక్షించారు. అనంతరం అర్జునుడు పాత్ర కళాకారుడు తపస్మాన్ పైకి ఎక్కి విల్లంబులు చేతబూనిన అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

రోడ్ల విస్తరణలో చెట్ల తొలగింపు



కురబలకోట: ములకల చెరువు నుండి మదనపల్లె వరకు 41 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి (ఎన్ హెచ్ 42)పోర్‌వే రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఇందుకు కేంద్రం రూ.480.10 కోట్లు మంజూరు చేసింది. బురకాయలకోట, అంగళ్లలో ట్రాఫిక్ సమస్య లేకుండా బైపాస్ రోడ్లు నిర్మిస్తారు. ఎంబీటీ రోడ్డుకు బ్రిటీషు హయాం నుండి రోడ్డుకు ఇరువైపులా నిలువ నీడలా చెట్లు ఉండేవి. చింత, నీలగిరి, వేప, నేరేడు తదితర చెట్లు ఏపుగా ఉంటూ అటు వాహనదారులకు ఇటు బాటసారులకు నిలువ నీడలా ఉండేవి. ఇలాంటి చెట్లను ఇటీవల రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించక తప్పలేదు. పెద్ద చెట్లను సైతం కట్టర్లతో నిమిషాల్లో నేల మట్టం చేశారు. త్వరలో రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు కూడా తొలగించి తారు రోడ్డు వేయనున్నట్లు హైవే అధికారులు వెల్లడించారు.

వైభవంగా రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు



రథోత్సవానికి హాజరైన భక్తులు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరులో గురువారం జరిగిన శ్రీ పట్టాభిరాముల బ్రహ్మ రథోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో నాలుగు రోజుల పాటు పలు పూజా కార్యక్రమాలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, రామనామ, గోవిందనామ స్మరణలతో ఆలయ ప్రాంగణం హోరెత్తింది. రథోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. రథాన్ని ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించారు. శ్రీ సీతారాముల ఉత్సవ మూర్తులను రథంపై ఊరేగించారు. సర్వాంగ సుందరుడైన రామచంద్రమూర్తి రథంలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. గోవింద, రామ నామ స్మరణలతో గ్రామ పుర వీధులు మార్మోగాయి. అంగరంగ వైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో రథాన్ని ముందుకు లాగారు. పలువురు భక్తుల సౌకర్యార్థం ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు, బెల్లం పానకాలను పంపిణీ చేశారు. మండల రాజకీయ నాయకులు, అధికారులు రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు.

నేడు వసంతోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వసంతోత్సవం, పార్వేటోత్సవం, శయనోత్సవం కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు కరణం ప్రకాష్‌రావ్ తెలిపారు.

విశ్వసనీయతకు నిదర్శనం సీఎం జగన్

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మెగా చెక్కును అందచేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి: విశ్వసనీయతకు నిలువెత్తు నిదర్శనంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిలిచారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. కలికిరి పట్టణ పరిధిలోని మెయిన్ స్కూల్ (తెలుగు) ఆవరణలో గురువారం మండలంలోని స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం విడుదల చేసిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024 ఎన్నికలలో మళ్లీ జగన్‌ను సీఎంను చేసుకోవాలని, లేని పక్షంలో ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలకు మంగళం తప్పదన్నారు. వైఎస్సార్ ఆసరా మూడవ విడతలో భాగంగా మండలంలోని 856 స్వయం సహాయక సంఘాలకు రూ.7,05,72,105 మెగా చెక్కును ఎమ్మెల్యే చింతల మహిళలకు అందచేశారు. మైనార్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అఘామొహిద్దీన్, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రమేష్ కుమార్ రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్‌రెడ్డి, శివాజీ, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మెన్ సతీష్ రెడ్డి, ఎంపీడీఓ గంగయ్య, వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ రూతు, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, సర్పంచ్‌లు ఆర్.వెంకటరెడ్డి, నాగవేణి, ఎంపీటీసీ సభ్యుడు అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తును విజయవంతం చేయాలి

క్షేత్ర స్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా చేపట్టిన ×జగనన్నే మా భవిష్యత్తు౯ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ మండల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆఘామొహిద్దీన్, పీలేరు, కలికిరి, గుర్రంకొండ, కలకడ మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి, రమేష్ రెడ్డి, ముక్తియార్, కమలాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చేలా సీఎం జగన్ సుపరిపాలన

వాల్మీకిపురం: పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను గుర్తించి వాటిని పరిష్కరిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చింతపర్తి పంచాయతీ మద్దెలచెరువుపల్లి, చింతపర్తి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, నాయకులు చింతల శివానంద రెడ్డి, ఓరుగంటి రమేష్, లక్ష్మినారాయణ రెడ్డి, ఫారుఖ్, నల్లంకి నరసింహులు, చెంగల్‌రెడ్డి, శ్రీనాథ రెడ్డి, కిరణ్ కుమార్, యల్లారెడ్డి, ద్వారకనాథ రెడ్డి, వెంకట్రమణ పాల్గొన్నారు.

రూ.10 లక్షల పన్ను వసూలు

బి.కొత్తకోట: బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలో ఇంటి పన్నుల బకాయిలపై ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటుతో రూ.10 లక్షల పన్నులు వసూలైనట్లు కమిషనర్ పలసాని నరసింహప్రాద్ చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ మార్చి31 నాటికి పన్నులు చెల్లించిన వారికి వడ్డీ, పెనాల్టీలు మాఫీ అయినట్లు చెప్పారు. తాజాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023–24లో చెల్లించాల్సిన పన్నులను చెల్లించిన వారికి ఐదు శాతం రిబేటు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆఫ్‌లైన్‌లో పన్నుల చెల్లింపు బిల్లును ఆన్‌లైన్ చేసి బకాయిలు మాఫీ చేశామని చెప్పారు.

ఇంటి పన్నుపై 5 శాతం రాయితీ

మదనపల్లె : మున్సిపాలిటీలో ఇంటిపన్నులకు సంబంధించి 2023–24 ఆర్థిక సంవత్సరానికి ముందస్తుగా ఏప్రిల్‌లో ఇంటిపన్ను చెల్లించేవారికి 5శాతం రాయితీ ఇస్తున్నట్లు కమిషనర్ కే.ప్రమీల తెలిపారు. గురువారం కమిషనర్ విలేకరులతో మాట్లాడుతూ... ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు ఇంటిపన్ను చెల్లింపునకు సంబంధించి ముందస్తుగా చెల్లించిన వారికి ఇంటిపన్నుపై 5 శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిందన్నారు. పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ముందస్తు పన్ను చెల్లింపులు జరిపి పన్ను రాయితీని పొందాల్సిందిగా కోరారు.

పాదయాత్ర విజయవంతం చేయాలి

ములకలచెరువు: కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి 30 వరకు జరిగే పాదయాత్రలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు కోరారు. గురువారం స్థానిక మండల కేంద్రంలో సీపీఐ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు గద్దెదింపే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఈ సమావేశంలో నాయకులు సలీంబాషా, అంజప్ప, హరికుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ములకలచెరువు: ములకలచెరువు సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో నాటుసారా తయారీ, కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు ఎస్‌ఈబీ సీఐ మల్లిక గురువారం తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి ఆమె పీటీయం మండలం, ములకలచెరువు మండలాల్లో వాహనాలు తనిఖీ నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ... నాటుసారా, కర్ణాటక మద్యం విక్రయాల్లో ఎక్కువ కేసులున్న వారిపై పీడీయాక్ట్‌కు సిఫార్సు చేస్తామన్నారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

ములకలచెరువు: మండలంలోని వేపూరికోటలో బీజేపీ నాయకులు గురువారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర నాయకులు గోపాల్‌రెడ్డి, శోభారాణి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీజేపీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మంగరాజు, ఫరీద్‌బాబు, సుధాకర్, భయ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిపాజిట్లపై అధికశాతం వడ్డీ

కలకడ : సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లో డిపాజిట్లపై అధికశాతం వడ్డీ అందజేస్తున్నామని ఆటో ద్వారా కరపత్రాలు పంపిణీ చేశారు. కలకడ సప్తగిరి గ్రామీణబ్యాంక్ శాఖ మేనేజర్ శివ ప్రత్యేకంగా ఆటోకు మైక్ ఏర్పాటు చేసి ప్రచారం చేశారు. గురువారం మండలంలోని గుడిబండ, కోన, నడిమిచెర్ల గ్రామాలలో పర్యటించి ప్రచారం చేశారు. నూతన వడ్డీ రేట్లు ప్రకారం ప్రభుత్వ రంగసంస్థ అయిన సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లో సీనియర్ సిటిజన్లకు 8శాతం వడ్డీ, యువతకు సైతం 7.5శాతం వడ్డీ చెల్లించడం జరుగుతుందని గుర్తు చేశారు.